
సాక్షి తిరుపతి

శనివారం । 19 । ఆగస్టు । 2023



భళారే వి'చిత్రం'!
ప్రపంచ స్థాయికి పోటీపడేలా ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న సాక్షి ఫొటోగ్రాఫర్లకు అభినందనలు తెలుపుతూ..
- IIలో



పరమేశ్వరికి పుష్పాభిషేకం
నూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం పుష్పాభిషేకం నిర్వహించారు.
- IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	36	25
తిరుమల	32	21
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

ఈవీఎం వీవీప్యాట్‌ల పరిశీలన



గోదాములో వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

రేణిగుంట: స్థానిక సీడబ్ల్యూసీ గోదాములో భద్రపరచిన ఈవీఎం వీవీ ప్యాట్‌లను కలెక్టర్ వెంకటరమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతితో సీడబ్ల్యూసీ గోదాములో ప్రత్యేక గదులను ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరచడానికి కేటాయించినట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీన బెంగళూరు నుంచి వచ్చిన 6,450 వీవీ ప్యాట్లను ఇక్కడ పటిష్ట బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా నడుమ భద్రపరచినట్లు వెల్లడించారు. ఆయన వెంట జేసీ డీకే బాలాజీ, డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, టీడీపీ నాయకుడు మునిరెడ్డి, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, ఎన్నికల తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

20న ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ టెస్ట్



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి

తిరుపతి అర్బన్: సివిల్ సర్వీసెస్ , గ్రూప్ 1, గ్రూపు 2 కోచింగ్ కోసం దరఖాస్తు చేసున్నవారికి ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 2,325 మంది పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్ష జిల్లా పర్యవేక్షణాధికారిగా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు సకాలంలో రావాలని సూచించారు. ఈ క్రమంలో ఎస్వీ ఆర్ట్ కళాశాల వింగ్- ఏలో 600మంది, వింగ్-బీలో 600 మంది, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 600 మంది, పద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో 300 మంది, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ హైస్కూల్‌లో 225 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా వసతులు కల్పించాలని ఆదేశించారు. సమీక్షలో సూపర్‌వైజర్లుగా నియమితులైన ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు, ఆర్‌టీసీ ఏటీఎం డీఆర్ నాయుడు, మెడికల్ ఆఫీసర్ ఉదయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్ర, పోలీస్‌శాఖ నుంచి బాలచంద్రరాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 174 మందికి ఉద్యోగాలు



అభ్యర్థికి నియామక పత్రం అందిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు శుక్రవారం స్థానిక ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. సంస్థ జిల్లా అధికారి శ్యామ్ మోహన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మేళా ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 13 పరిశ్రమల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై 363 మంది యువతీయువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారని వెల్లడించారు. అందులో 174 మందికి ఉద్యోగావకాశం కల్పించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా రెండో శుక్రవారం, నాలుగో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వెంకటరమణ, ఐటీఐ ప్రిన్సిపల్ ఉమారాణి పాల్గొన్నారు.

నేడు సర్పంచ్ స్థానానికి ఎన్నిక

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, 7 వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు డీపీఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు గ్రామ సర్పంచ్, మరో ఏడు చోట్ల వార్డు సభ్యుల ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుందని, 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించనున్నట్లు వివరించారు. అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.



గోవిందనామ స్మరణతో నడకమార్గంలో సెక్యూరిటీ నడుమ తిరుమలకు వెళుతున్న భక్తులు

గోవింద స్మరణే శ్రీరామరక్ష

కోటి జన్మల పుణ్యఫలంతోనే దేవదేవుని దర్శనం సాధ్యమని భక్తుల నమ్మకం.. సప్తగిరులపై స్వయంభువుగా వెలసిన శ్రీనివాసుని కరచరణాల వీక్షణతో సకల పాపాలు నశిస్తాయని విశ్వాసం.. కలియుగ వైకుంఠంగా అలరారుతున్న తిరుమల క్షేత్రానికి చేరుకుంటే.. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువుని సేవించుకున్నట్టే అని పురాణాల్లో పేర్కొన్నారు. అందుకే తిరుగిరులను అధిరోహించేందుకు నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా కాలినడకన శ్రీవారి సన్నిధికి చేరుకునేందుకు పరితపిస్తుంటారు. దట్టమైన అటవీమార్గంలో ముందుకు సాగుతూ.. గోవిందనామ స్మరణ చేస్తూ పులకిస్తుంటారు. ఈ క్రమంలో వన్యమృగాల సంచారం అధికమైన నేపథ్యంలో భక్తుల రక్షణకు టీటీడీ నడుంబిగించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. పలు నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తోంది. అందులో భాగంగా భక్తులకు చేతికర్రను సైతం అందించాలని నిర్ణయించింది.

- తిరుమల కాలినడక మార్గంలో భద్రత కట్టుదిట్టం
- తప్పెట్లు, తాళాలతో భజన చేయడం శ్రేయస్కరం
- చేతికర్ర సాయానికి శాస్త్రీయ కారణం
- డేంజర్ జోన్‌లపై పకడ్బందీ నిఘా
- చిరుతల కోసం నిరంతరం అన్వేషణ

సాక్షి, తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తప్పనిసరిగి కొన్ని నియమాలు, నిబంధనలు పాటించాలని టీటీడీ సూచిస్తోంది. వాటిని అమలు చేస్తే ముక్తితో పాటు ప్రాణాలకు రక్షణ కవచంలా నిలుస్తాయని తెలియజేస్తోంది. ప్రపంచం నలుమూలల నిత్యం ఏడుకొండల స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తు లు విచ్చేస్తుంటారు. అందులో బస్సులు, ఇతర వాహనాల్లో ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల చేరుకునేవారు కొందరైతే.. కాలినడక మార్గం నుంచి కలియుగ వైకుంఠానికి చేరుకునే వారు మరి కొందరు. అయితే తిరుమల చరిత్రలో ఎన్నడూ జరగని ఘటన ఇటీవల నడకమార్గంలో చోటు చేసుకుంది. నడకదారిలో చిన్నారిపై చిరుత దాడిచేసి ప్రాణాలు బలితీసుకున్న విషయం తెలిసిందే. చిన్నారి మృత్యువాత పడడంతో భక్తుల తక్షణ రక్షణకు టీటీడీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కాలినడక మార్గంలో రాకపోకలు సాగించే భక్తులకు చేతి కర్ర ఇవ్వాలని సంకల్పించింది. దీనిపై సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేయడాన్ని భక్తులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.



అలిపిరి కాలిబాటలో వెళుతున్న భక్తులు

అడవిలోకి వెళ్లకూడదు

గతంలో నడక మార్గంలో వెళ్లే భక్తులు గుంపులు గుంపులుగా తప్పెట్లు.. తాళాలతో గోవింద నామ స్మరణ చేస్తూ, భక్తి పాటలు పాడుకుంటూ తిరుమలకు వచ్చేవారు. ఇప్పుడు భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగినా.. భజన చేసుకుంటూ వెళ్లే వారు కరువయ్యారు. గోవిందనామ స్మరణ మరచి సెల్ఫీలు తీసుకుంటూ.. విడివిడిగా కొందరు, ఒంటరిగా మరి కొందరు వెళ్లి రావడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. సరైన దారిలోనే వెళ్లాలని, పక్కకు వెళ్లడానికి ప్రయత్నించ వద్దని అటవీ అధి కారులు సూచిస్తున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. మరుగుదొడ్డికి అయినా ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే వెళ్లాలని స్పష్టంగా చెబుతున్నా, కొందరు విడిగా అడవిలోకి ప్రవేశించి ప్రమాదాల బారిన పడుతున్నారు.

డేంజర్ జోన్లు ఇవే..!



తిరుమల కాలినడక మార్గంలో డేంజర్ జోన్లుగా కొన్ని ప్రాంతాలను టీటీడీ గుర్తించింది. ముందుగా 250వ మెట్టు వద్ద మైసూరు గోపురం, 2,083వ మెట్టు వద్ద మూడో గాలి గోపురం వస్తుంది. అక్కడి నుంచి కొండపైకి వెళ్లే నడకదారి మైదాన ప్రాంతంలా ఉంటుంది. తర్వాత ఏడో మైలు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం ఉన్న ప్రాంతం. అలాగే కొద్ది దూరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు వెళ్లే మార్గాన్ని డేంజర్ జోన్‌గా టీటీడీ ప్రకటించింది.

క్రూర మృగాలు ఎందుకొస్తున్నాయంటే..

చిన్నారులపై దాడితో మెట్ల మార్గంలోకి చిరుతలు, ఎలుగుబంటి, ఇతర జంతువులు ఎందుకొస్తున్నాయనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే మెట్ల మార్గంలోకి తరచూ చిరుతలు రావడానికి అనేక కారణాలున్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లాలంటే...మొత్తం అటవీ మార్గమే. అలిపిరి మెట్ల మార్గమైనా, శ్రీవారిమెట్టు మార్గమైనా మొదటి నుంచి చివరి వరకూ అడవే. అందులోనూ రిజర్వు ఫారెస్టు కావడంతో శేషాచలంలో వన్యప్రాణులు ఎక్కువగానే ఉంటాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో నెలల తరబడి చడీచప్పుడు లేకపోవడంతో అడవి జంతువులు.. మెట్లమార్గంలోనూ, ఘాట్ రోడ్లలోనూ స్వేచ్ఛగా సంచరించడం మొదలుపెట్టాయి. అందుకే కరోనా తర్వా త చిరుతలు, ఎలుగుబంట్ల సంచారంపై తరచూ వార్తలొచ్చాయి.

చేతి కర్ర వెనుక కారణం ఇదీ

నడక మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తుల తక్షణ రక్షణ కోసం చేతికర్ర ఇవ్వాలని నిర్ణయించినట్లు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. భక్తులకు చేతికర్ర ఇవ్వడం వెనుక ఓ శాస్త్రీయ కారణం ఉందని నిపుణులు చెబుతున్నారు. చిరుతల దాడి మిగతా వన్యమృగాలకు భిన్నంగా ఉంటుంది. ప్రాణి ఎత్తును లెక్క వేసుకుని చిరుతలు దాడి చేస్తుంటాయి. తక్కువ ఎత్తు ఉండే ప్రాణులపైనే దాడి చేసేందుకే మొగ్గుచూపుతుంటాయి. ఎత్తుగా ఉండే ప్రాణులపై దాడికి తమ శక్తి సరిపోదని భావిస్తాయి. ఈ క్రమంలో మనిషి చేతి కర్రను పైకెత్తినప్పుడు అంత ఎత్తువరకు మనిషి ఉంటాడని లెక్కేసుకుంటాయి. అందుకే దాడికి భయపడి వెనక్కిపోతాయనేది ఓ కారణం. ఇదే విషయాన్ని అటవీ అధికారులు కూడా స్పష్టం చేస్తున్నారు. అందుకే టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతి కర్ర ఇవ్వాలని నిర్ణయం తీసుకుని ఉంటారని నిపుణులు చెబుతున్నారు.

కాలినడక మార్గంలో దారి పొడుగు నా దుకాణాలు ఉన్నాయి. ఆయా షాపుల నిర్వాహకులు వ్యర్థాలను, కొందరు యాత్రికులు ఆహార పదార్థాలను అడవిలో పడేయడం వల్ల తినేందుకు జింకలు, దుప్పిలు తదితర సాధు జంతువులు వస్తున్నాయి. ఆయా ప్రాణుల కోసం చిరుతలు వస్తుంటాయని అధికారులు చెబుతున్నారు.

చిరుతలు దాడికి సాహసించవు

సాధారణంగా చిరుతలు మనుషులపై దాడి చేయవని అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. చిన్నారి లక్షిత నడకదారి నుంచి పక్కకు వెళ్లడంతో ఏదో జంతువుగా పొరబడి చిరుత దాడి చేసి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. శబ్దాలు చేస్తూ మెట్లపై నడిచే మనుషుల జోలికి చిరుతలు రావని తేల్చి చెప్పారు. డేంజర్ జోన్‌గా గుర్తించిన ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు.

భద్రత కోసం చర్యలు

శ్రీవారి భక్తుల సౌకర్యం కోసం టీటీడీ రూ.వందల కోట్లు ఖర్చు చేసి నడక దారులను అద్భుతంగా నిర్మించింది. రాత్రిపూట కూడా నడవడానికి ఇబ్బందిలేకుండా కాంతివంతమైన విద్యుత్ దీపాలు అమర్చింది. . తాజా ఘటనల నేపథ్యంలో నిఘా నిమిత్తం 300 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయించింది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో గార్డులను పెట్రోలింగ్‌కు నియమించింది.





చిరుతల కోసం నూతన బోన్లు



తిరుమల : కాలినడక మార్గంలో చిరుత సంచారం అధికమైన నేపథ్యంలో టీటీడీ అటవీశాఖ, ప్రభుత్వ అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఆపరేషన్ చిరుత చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అలిపిరి–తిరుమల మార్గంలో మరో ఆరు నూతన బోన్లు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి తెప్పించిన ఈ బోన్లను చిరుత సంచరించే ప్రాంతాల్లో అమర్చారు. చిరుతలు, ఎలుగుబంట్లను పట్టుకుని భక్తులకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

దుష్టభీతి తొలగుతుంది



ప్రతి ఒక్కరు గోవింద న్మాస్మరణ ద్వారా ముక్తిని పొందుతారు. మానవుడు ఏ జన్మలోఫలితాన్ని ఆ జన్మలోనే అనుభవిస్తాడు. నారాయణ నామ స్మరణ ద్వారా సకల పాపాలు నశించి ఉత్తమమైన జన్మ కలుగుతుంది. హరినామ స్మరణ ద్వారా మన శరీరంలో పవిత్రత ఏర్పడి, మనలో ఉండే దుష్టభీతి తొలగి ముక్తి లభిస్తుంది.

– గణేష్ స్వామి, కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీదేవి ఆలయ ప్రధాన అర్చకుడు

సరైన నిర్ణయం



గ్రామాల్లో ఒంటరిగా పొలానికి వెళ్లే రైతు చేతిలో కర్ర ఉంటుంది. ఆ సమయానికి రైతుకు అదే తోడు, రక్షణ. అటవీ ప్రాంతాల్లో సంచరించే గిరివాసులకు కర్ర బలమైన ఆయుధం. ఏనుగును మావటి నియంత్రించేది చేతికర్రలాంటి అంకుశంతోనే. కర్రలతో అలికిడి చేస్తే జంతువులు దూరంగా వెళ్లే అవకాశం ఉంటుంది. వృద్ధులకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.

– సీహెచ్ భాస్కర్, ఎస్‌బీఐ మేనేజర్, సూర్యాపేట, తెలంగాణ

ఓల్డ్ ఈజ్ గోల్డ్



రక్షణ కోసం గతంలో చేతిలో కర్ర పట్టుకుని వెళ్లడం చూశాం. భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ చేతి కర్ర ఇస్తామని చెబుతోంది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్టు మంచి నిర్ణయమే. మాకు కొత్త అనుభూతిగా మిగులుతుంది.

–భక్త బృందం, మూసాపేట, హైదరాబాద్

అయప్ప సేవలో మంత్రి పెద్దిరెడ్డి



అయప్ప సన్నిధిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

తిరుపతి మంగళం: శబరిమలై అయ్యప్పస్వామిని శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఇరుముడి కట్టి శబరికి వెళ్లిన ఆయనకు అక్కడి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి సన్నిధిలో ఇరుముడి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అయ్యప్ప ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. మంత్రి వెంట రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత

రేణిగుంట: ఏర్పేడు మండలం, పాతవీరాపురానికి చెందిన పార్టీ కార్యకర్త దామోదర్‌రెడ్డి కుమార్తె కుమారి(20) బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసింది. ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం కావాలని ఇటీవల ఆమె స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి విన్నవించగా.. ఆయన స్పందించారు. శుక్రవారం రూ.లక్ష అందజేశారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సంధ్య, సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుమారి ఉన్నత చదువుల నిమిత్తం తండ్రి దామోదర్‌రెడ్డికి రూ.లక్ష అందిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

సంగీత ఆరాధ్యుడు త్యాగరాజు

తిరుపతి కల్చరల్: సంగీత ఆరాధ్యుడు శ్రీత్యాగరాజ స్వామి అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమావేశ మందిరంలో శ్రీత్యాగరాజ సంగీతోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్‌తో పాటు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సంగీతోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భక్తిపరవశంతో సంగీత సారభాన్ని అజరామజరంగా సాగించిన ఘనత శ్రీత్యాగరాజుకే దక్కుతుందన్నారు. తిరుపతి నగరంలో శ్రీత్యాగరాజ మండపంతో తనకు ఐదు శతాబ్దాలుగా అనుబంధం ఉందని తెలిపారు. సంగీతం , నాటకం, ఉద్యమోత్సవాలు, సాంస్కృతిక ఉత్సవాలు, సభలు, సమావేశాలకు తిరుపతిలో తొలి వేదిక త్యాగరాజ మండపమేనని స్పష్టం చేశారు. టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ నేటి యువతలో సంగీతంపై మక్కువ తగ్గడం, పాశ్చాత్య సంస్కృతి పట్ల ఆసక్తి పెంచుకోవడంతో సంప్రదాయ సంగీత కళ సన్నగిల్లుతోందని ఆవేదన చెందారు. అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ మోహన సుందరం, కార్యదర్శి కంచి రఘురామ్, కోశాధికారి ప్రభాకర్, ఎం.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన (ఇన్‌సెట్) సంగీత విద్వాంసుల గీతాలాపన

అలరించిన మల్లాది బ్రదర్స్ సంగీతాలాపన

సంగీతోత్సవాల్లో భాగంగా మల్లాది బ్రదర్స్ మల్లాది రాంప్రసాద్, మల్లాది రవికుమార్ ప్రదర్శించిన సంగీత కచేరి సభికులను అలరింపజేసింది. వీరికి వయోలిన్‌పై కొమాండూరి క్రిష్ణ, మృదంగంపై రమేష్, కంజీరపై శివానంద్ సహకారం అందించారు. దీనికి ముందు ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల మంగళ వాయిద్య, నాదస్వరం కచేరి ఆకట్టుకుంది.

నడకమార్గంలో దుకాణదారులకు అవగాహన

తిరుమల : తిరుమల నడక మార్గాల్లో భక్తుల భద్రత దృష్ట్యా దుకాణదారులకు పలు అంశాలపై టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అవగాహన కల్పించారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో పోలీసు, అటవీ, ఎస్టేట్, ఆరోగ్య శాఖ అధికారులతోపాటు దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ అలిపిరి నడక మార్గంలో తినుబండారాలు విక్రయించే దుకాణాలు వందకు పైగా ఉన్నాయని, వీటిలో ఇకపై పండ్లు, కూరగాయలు అమ్మకూడదని సూచించారు. భక్తులు వీటిని కొనుగోలు చేసి సాధు జంతువులకు తినిపిస్తున్నారని, దీంతో వాటి రాక పెరుగుతోందని చెప్పారు. ఈ జంతువుల కోసం క్రూరమృగాలు వచ్చి భక్తులపై దాడి చేస్తున్నాయని వెల్లడించారు. దుకాణాల వద్ద తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా కుండీల్లో వేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తినుబండారాల దుకాణదారులు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. క్రూరమృగాల జాడ కనిపిస్తే వెంటనే సమాచారం అందించేందుకు వీలుగా అధికారుల ఫొన్ నంబర్లు ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఏఎస్పీ మునిరామయ్య, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎస్‌ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, డీఎఫ్‌ఓ సతీష్, టీటీడీ డీఎఫ్‌ఓ శ్రీనివాస్, ఎస్టేట్ ప్రత్యే కాధికారి మల్లికార్జున, ఆరోగ్యఅధికారి శ్రీదేవి, ఈఈ సురేంద్రనాథ్‌రెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ) కళాశాలలో డిప్లొమో కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఓఎస్‌డీ జీ.వెంకట్‌రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెటరల్ ఎంట్రీ, టీహెచ్‌టీటీ (హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ) రెండు, మూడేళ్ల డిప్లొమో కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 21వ తేదీ లోపు తమ విద్యార్హత సర్టిఫికెట్లను నేరుగా కళాశాలలో గానీ, ఠీఠీఠీ.జీజీజ్ఞిజట.ఛొరు , వెబ్‌సైట్, సంస్థ కార్యాలయం నం.08625 295003, 93999 36872, 98661 69908, 90102 43054లో గానీ సంప్రదించి పరిశీలించుకోవాలని ఆయన సూచించారు.

మద్యం తాగొద్దన్నందుకు పురుగుల మందు తాగి..

తడ: మద్యం తాగొద్దని భార్య పట్టుబట్టడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం..తడ పంచాయతీ, సుజాతానగర్‌కి చెందిన అబ్బాయిరెడ్డి పశుపతి(72) మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించింది. ఎలాగైనా తన భర్తతో మద్యం మాన్పించాలని భార్య ఒత్తిడి పెంచింది. దీంతో మనస్తాపానికి గురైన పశుపతి గురువారం రాత్రి గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పక్కన పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం చెన్నైకి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

తుది దశకు ఓటర్ల సర్వే

తిరుపతి అర్బన్ : ఓటర్ల సర్వే తుదిదశకు చేరుకుందని, ఇక మూడు రోజులు మాత్రమే సమయముందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వర్చువల్ విధానంతో సమీక్షించారు. అనంతరం ఓటర్ల సర్వే అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 84శాతం మాత్రమే పూర్తి చేశారని, వంద శాతం చేయాల్సి ఉందని వెల్లడించారు. ఫారం 6,7,8కి సంబంధించి 1,27,461 దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుకు 13,477 దరఖాస్తులు అందాయని తెలిపారు. సమావేశంవలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత , డీఆర్‌ఓ కోదండరామి రెడ్డి , ఈఆర్‌ఓలు కనకనరసారెడ్డి, కిరణ్ కుమార్, రామారావు, చంద్రముని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, రాధమ్మ, జ్యోతి, ప్రసాదరావు, ఎన్నికల తహసీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

మహిళలకు శిక్షణ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : ఆర్థిక నిర్వహణపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అవగాహన కల్పించారు. శుక్రవారం తొట్టంబేడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ రుణాలు, చెల్లింపులకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని, పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పొదుపు, రుణాల వసూలుపై గ్రూపు లీడర్లు జాగ్రత్త తీసుకొని బ్యాంకుల్లో చెల్లించాలని కోరారు. రుణాల రీ పేమెంట్‌ను పాసుపుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కోరారు. ఆర్థిక అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని, సీసీలు, సంఘమిత్రలే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ దినేష్ రెడ్డి, ఏపీఎం గురుమూర్తి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముక్కంటి ఉద్యోగి మృతి



రఘునాథరెడ్డి మృతదేహం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రఘునాథరెడ్డి(50) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వైఎస్సార్ జిల్లా, సురుటుపల్లికి చెందిన రఘునాథ రెడ్డి కొంత కాలంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం భూలావాదేవీలపై అధికారులను కలిసేందుకు తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో రాజంపేట వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధికి కృషి



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

తిరుపతి తుడా : తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. శుక్రవారం రాయలచెరువు రోడ్డులోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీతో పాటు వివిధ వార్డులను సందర్శించి వసతులు, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధి అంశాలను ఇప్పటికే పార్లమెంటులో అనేకమార్లు ప్రస్తావించానని చెప్పారు. వంద పడకలకు విస్తరించాలని విజ్ఞప్తి చేశానని వెల్లడించారు. త్వరలోనే ఆర్‌ఓ ప్లాంట్ అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఉద్యోగుల విన్నపం మేరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన నాగమణి

నాయుడుపేటటౌన్ : శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డుపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పెళ్లకూరు మండలం శిరసనంబేడు చెందిన టి.నాగమణి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నాయుడుపేటలోని బంధువుల ఇంటిలో ఓకార్యక్రమానికి హాజరైంది. సమీప బంధువైన ఉదయ్ కిరణ్‌తో స్కూటీలో తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మరో బైక్ ఢీకొంది. దీంతో కింద పడిన నాగమణి చేతిపై వెనుక వస్తున్న ట్యాంకర్ ఎక్కేసింది. బాధితురాలి చేయి పూర్తిగా నుజ్జు నుజ్జుగా మారిపోయింది. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో క్షతగాత్రురాలికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి



ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శుక్రవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఈఓ భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా.. ఆలయ ఈవో అమ్మవారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందించారు.

ధర్మబద్ధంగా నడుచుకోవాలి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కసిరెడ్డి వెంకటరెడ్డి, వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: మానవుడు ధర్మబద్ధంగా నడుచుకోవడమే మహాభారత సారాంశమని టీటీడీ ధర్మప్రచార పరిషత్ పూర్వ కార్యదర్శి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సెనేట్ హాల్లో శుక్రవారం ×ఆంధ్ర మహాభారతం–ధార్మిక అంశాలు÷ అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ప్రధాన వక్తగా విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ధర్మాన్ని అనుసరించి అర్థాన్ని, కామాన్ని పొందాలన్నారు. మానవ జీవన విధానమే ధర్మమని, ప్రపంచంలో మహాభారతాన్ని మించిన గ్రంథం మరొకటి లేదని నొక్కివక్కాణించారు. ఎస్వీయూ వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ మానవత్వం పరిమళించిన మహనీయుడు జియస్ రెడ్డి అని, తెలుగు ఆచార్యుడు తొలిసారి వర్సిటీకి వైస్ చాన్సలర్‌గా పనిచేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, సునీల్, బ్రహ్మానందరెడ్డి, ఆదిశేషయ్య, అశోక్ పాల్గొన్నారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి పుష్పాభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ ఆస్థానమండపంలో చెంగాళమ్మ ఉత్సవమూర్తిని కొలువుదీర్చి 108 రకాల విరులతో వేదపండితులు శాస్త్రోక్తంగా పుష్పయాగం జరిపించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై అమ్మవారిని సేవించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. పుష్పయాగానికి చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు–సులోచనమ్మ, నంబూరు మనోజ్ సాయి–లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, వట్టూరు రాధాకిషోర్‌యాదవ్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మీదేవికి ఆస్థాన సేవ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మీదేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం కావడంతో ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని తిరుచ్చిపై ఉంచి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించి పునీతులయ్యారు.

విశ్రాంతి గృహ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : మొబైల్ తయారీ సంస్థ సెల్‌కాన్ ఆధ్వర్యంలో తిరుమలలో విశ్రాంతి గృహ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడిడ్డ పాల్గొన్నారు. ఏడాది లోపు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు సెల్‌కాన్ చైర్మన్ వై.గురు తెలిపారు.

స్పెషల్ పార్టీ పోలీసులకు ‘దర్బార్’



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్ : నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పెషల్‌పార్టీ పోలీసుల సమస్యల పరిష్కారానికి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శుక్రవారం దర్బార్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా స్పెషల్ పార్టీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. హోదా, యూనిఫామ్‌తో సంబంధం లేకుండా వృత్తి మీద గౌరవంతో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు

ప్రాంగణ ఎంపికలో ఏడుగురికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో ప్రభాకర్ రెడ్డి

తిరుపతి సిటీ : తిరుపతి శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఏడుగురు విద్యార్థులకు ఉద్యోగావకాశం వచ్చినట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వారం క్రితం గరుడ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన ఇంటర్వ్యూలో శ్రీకాంత్, ప్రశాంత్, పవన్ కల్యాణ్, హరీష్, గాయత్రి, వెంకటరాజా, సతీష్ ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు. ప్లేస్‌మెంట్ ఇంచార్జి డాక్టర్ పీవీ సత్యగోపాల్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై టీచర్లకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 19న గూడూరు డివిజన్‌కు సంబంధించి పట్టణంలోని బాలుర జెడ్పీ హైస్కూల్, 21న శ్రీకాళహస్తి బాలుర జెడ్పీ హైస్కూల్, 22న తిరుపతి ఎస్వీ హైస్కూల్(టీటీడీ)లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తామని, ఆయా డివిజన్ల పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఒక్కో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా హాజరవ్వాలని స్పష్టం చేశారు.

భళారే విచిత్రం!

● నేడు ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం







ఒక ఫొటో.. కోటి ప్రశ్నలకు సమాధానమిస్తుంది.. చరిత్రను దశదిశలా చాటి చెబుతుంది.. ఆనంద క్షణాలకు గుర్తుగా నిలబడుతుంది.. విషాద ఘటనలను ప్రతిబింబిస్తుంది.. ప్రకృతి అందాలను రెట్టింపు చేస్తుంది.. ఫొటోగ్రాఫర్ సునిశిత పరిశీలనకు గీటురాయిగా నిలుస్తుంది.. ఈ క్రమంలోనే ఫొటోల చిత్రీకరణకు ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ యుగంలో ప్రపంచంతో పోటీ పడేలా తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న సాక్షి ఫొటోగ్రాఫర్లకు అభినందనలు తెలుపుతూ..

– కేతారి మోహన్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు



అవార్డుకు ఎంపికైన ఫొటో



కేతారి మోహన్ కృష్ణ

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయి అవార్డుకు సాక్షి తిరుపతి ఫొటోగ్రాఫర్ కేతారి మోహన్ కృష్ణ ఎంపికైనట్లు ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్‌వీఎస్ విజయభాస్కరరావు, వి.రూబెన్ బెసాలియల్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన జాతీయస్థాయి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ పత్రికల ఫొటోగ్రాఫర్ల నుంచి సుమారు 700 ఎంట్రీలు వచ్చాయన్నారు. అందులో మొత్తం 46 ఎంట్రీలు అవార్డులు ఎంపికైనట్లు వెల్లడించారు. ఫొటో జర్నలిజం విభాగంలో నిద్రకు చోటు ఎరుగదు అనే సత్యాన్ని ఆవిష్కరిస్తూ మోహనకృష్ణ తీసిన ఫొటోకు అవార్డు వచ్చిందని వివరించారు. ఈనెల 19వ తేదీన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో అవార్డు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.